సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

ఆదివారం । 20 । జూలై । 2025



కర్నూలు, నెల్లూరు జట్ల విజయం
కడప నగరంలో జరుగుతున్న ఏసీఏ అండర్-16 మల్టీ డే మ్యాచ్‌లో శనివారం మూడో రోజు కర్నూలు, నెల్లూరు జట్లు విజయం సాధించాయి. -8లో



సమస్యలు పరిష్కరించేవరకు పనులు జరగనివ్వం
టెయిలింగ్ పాండ్ ఎత్తు పెంచితే ఆత్మహత్యలు చేసుకుంటామని వేముల మండలం కె.కె.కొట్టాల గ్రామస్తులు అన్నారు. -8లో

గరిష్టం/కనిష్టం
33.4/26.5

వాతావరణం
జిల్లాలో శనివారం 26.5 - 33.4 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.6 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

యువతకు ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డి సర్కిల్: నిరుద్యోగ యువతకు బెంగుళూరులోని ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కంప్యూటర్, ట్యాలీ కోర్సులలో శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సెంటర్ అడ్మిషన్స్ కో–ఆర్డినేటర్ హరిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్, డిప్లమో, డిగ్రీ పాస్ లేదా ఫెయిల్ అయిన వారు 18 నుంచి 28ఏళ్ల లోపు ఉండాలన్నారు. 35రోజులపాటు శిక్షణ ఉంటుందని, శిక్షణా కాలంలో ఉచిత వసతి, భోజన వసతి కల్పిస్తామన్నారు. ఆసక్తి గల నిరుద్యోగులు ఇతర వివరాలకు 9000487423 అనే ఫోన్ నెంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

నేడు చైల్డ్ డెవలప్‌మెంట్‌పై అవగాహన సదస్సు

కడప కార్పొరేషన్: పిల్లల ఎదుగుదల, తెలివితేటలు, ఎదుగుదలలోని లోపాలను, చదువులో వెనుకబాటుతనం, మాట సరిగా రాకపోవడం, వినికిడి లోపాలు మొదలగు సమస్యలపై అనుభవజ్ఞులైన వైద్యులచే అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు అస్యూర్ యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపింది. మద్రాసు రోడ్డులోని ఐఎంఏ హాలులో ఆదివారం ఉదయం 10 గంటలకు నిర్వహించే ఈ అవగాహన సదస్సులో ఆటిజమ్– అక్టివిటీ, బుద్ధిమాంద్యం తదితర సమస్యలపై కూడా వైద్యులు పరీక్షిస్తారన్నారు. చిన్న పిల్లల వైద్యులు హాజరై అవగాహన కల్పిస్తారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

నేటితో గడువు ముగింపు

కడప ఎడ్యుకేషన్: కడప రిమ్స్ వద్ద ఉన్న ప్రభుత్వ ఐటీఐ మైనారిటీస్‌లో 2వ విడత అడ్మిషన్లకు 20వ తేదీతో గడువు ముగుస్తుందని ప్రభుత్వ మైనారిటీస్ ఐటీఐ ప్రధానాచార్యులు జ్ఞానకుమార్ తెలిపారు. 10వ తరగతి పాస్ లేదా ఫెయిల్, ఇంటర్ పాస్ లేదా ఫెయిల్ .. ఆపై అర్హతలు ఉన్న విద్యార్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నామని తెలిపారు. అభ్యర్థులు నేరుగా తమ 10వ తరగతి మార్కుల జాబితా, టీసీ, కుల ధ్రువీకరణపత్రం, ఆధార్, ఫొటో, మెయిల్ ఐడీ, మొబైల్ నెంబర్ తీసుకుని ఐటీఐ వద్దకు వచ్చి ఉచితంగా ఆన్‌లైన్ ద్వారా iti.ap.gov.in అను పోర్టల్‌లో దరఖాస్తును సమర్పించాలని తెలిపారు. అభ్యర్థులు స్వయంగా కూడా దరఖాస్తు వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

కోదండ రామయ్యకు స్నపన తిరుమంజనం



స్వామి వారికి పట్టువస్త్రాలు, పుష్పమాలికలు తీసుకొస్తున్న టీటీడీ అధికారులు

ఒంటిమిట్ట: ఆంధ్ర భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి దేవాలయంలో శనివారం స్వామి వారికి వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యా ల నడుమ స్నపన తిరుమంజన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ టీటీడీ అధికారుల ఆధ్వర్యంలో సుప్రభాత సమయాన శ్రీరామచంద్రమూర్తికి పట్టు వస్త్రాలు, పుష్పాలు, ఫలాలు, అభిషేక సామగ్రి సమ ర్పించారు. గర్భాలయంలో సీతారామలక్ష్మణ మూర్తులకు అభిషేకాలు చేసి, పట్టువస్త్రాలు, పుష్పమాలికలు, ఆభరణాలతో ముస్తాబు చేశారు. అనంతరం ఆలయ పండితులు వేద పారాయణం, సహస్త నామార్చన, కుంకుమార్చన, మంగళహారతులతో విశేష పూజలు నిర్వహించారు.


పాఠశాల తనిఖీ



పాఠశాల సముదాయ ఉపాధ్యాయుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌జేడీ కె.శామ్యూల్

బద్వేలు: బద్వేలు పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను శనివారం ప్రాంతీయ విద్యా సంచాలకులు కె.శామ్యూల్ ఆకస్మిక తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో విద్యార్థునులకు అవసరమైన వసతులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పాఠశాల సమావేశ మందిరంలో జరుగుతున్న పాఠశాల సముదాయ ఉపాధ్యాయుల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్‌జేడీ శామ్యూల్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఎవరి పాత్యాంశంలో వారు అంకితభావంతో ఆహ్లాదకరమైన వాతావరణలో నాణ్యమైన విద్యను అందించాలని పేర్కొన్నారు. పాఠశాలలో ఉన్న ప్రతి నిమిషాన్ని విద్యార్థుల ఉన్నతికి ఉపయోగించాలని తెలిపారు. అనంతరం పాఠశాలలోని సర్వేపల్లి రాధాక్రిష్ణ విద్యామిత్ర కిట్లను పరిశీలించారు. ఈ సమావేశంలో మండల విద్యాశాఖాధికారి చెన్నయ్య, హెచ్‌ఎం కొండా వెంకటరామిరెడ్డి మాట్లాడారు. పాఠశాల సముదాయ ఉపాధ్యాయులు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలపై ఫీవార్



మెల్లగా నల్లని మబ్బులు ముసురుకుంటాయి.. ఉన్నట్లుండి చినుకులు రాలుతాయి.. మళ్లీ కాసేపటికే ఎర్రటి ఎండ చురుక్కుమంటుంది.. ఇలా మారుతున్న వాతావరణంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. పల్లె..పట్టణం తేడా లేదు.. చిన్నా పెద్దా తారతమ్యం అసలే లేదు.. గడపకొకరు అనారోగ్యంతో బాధపడుతున్నారు. జ్వరమో.. ఒళ్లనొప్పులో.. జలుబో దగ్గో.. ఇలా ఏదో ఒక లక్షణంతో ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు కలుషిత నీటితో.. దోమల దాడులతో వైరల్ ఫీవర్.. ప్రజలపై యుద్ధం చేస్తున్నాయి. ఫలితంగా ఆస్పత్రులు జ్వరబాధితులతో కిటకిటలాడుతున్నాయి. పలుచోట్ల సరైన మందు బిళ్లలు లేక.. పరీక్ష చేసే మిషన్లు లేక ప్రజలు అల్లాడుతున్నారు. ఇంత జరుగుతున్నా ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం విచారకరం.

- ప్రభుత్వ ఆస్పత్రుల్లో మందుల కొరత
- ఆఖరికి జలుబు,దగ్గు మందులూ కరువే..
- ప్రజలకు అందని ప్రభుత్వ వైద్యం



కడప రిమ్స్‌లో ఓపీ రిజిస్ట్రేషన్ కోసం ప్రజల అవస్థలు



వైద్య సేవలు పొందుతున్న జ్వర పీడితులు

సాక్షి గ్రాండ్ రిపోర్ట్

కడప రూరల్: ప్రజలపై జ్వరాలు విజృంభిస్తున్నాయి. వాతావరణంలో పెను మార్పులు రావడంతో జ్వరాలు చుట్టుముట్టాయి. దీనికి కలుషిత నీరు, అపరిశుభ్రత వాతావరణం తోడైంది. ఫలితంగా విష జ్వరాలు దాడి చేస్తున్నాయి. మరో వైపు జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ వైద్యానికి సమస్యల జబ్బు పట్టింది. దీంతో సక్రమంగా వైద్య సేవలు అందకపోవడం ప్రజలకు శాపంగా మారింది.

- కమలాపురంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో మౌళిక సదుపాయాలు పడకేశాయి. ఇక్కడ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించే కీలకమైన ఎక్స్ రే సౌకర్యం లేదు. ఆఖరికి ఈసీజీ సదుపాయం కూడా లేదు. ఈ రెండు రకాల పరీక్షలకు రోగులు కడపకు వస్తున్నారు. ఉచితంగా అందాల్సిన వైద్య సేవలకు డబ్బులు ఖర్చు చేస్తున్నారు. ఆ ఆసుపత్రిలో నీటి సౌకర్యం లేకపోవడం దారుణం.
- ప్రొద్దుటూరు పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో చక్కెర వ్యాధిని నియంత్రించే ఇన్సులిన్ ఇంజక్షన్‌లకు కొరత ఏర్పడింది. ప్రధానంగా ఇక్కడ ఉన్న జిల్లా ఆసుపత్రికి ఒక రోజుకు 800 నుంచి 1000 వరకు ఔట్ పేషెంట్స్ వస్తారు. అందులో దాదాపు 200 మంది వరకు జ్వరాలతో బాధపడే వారే ఉన్నారు.
- జమ్మలమడుగులోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో వైద్యులు సమయ పాలన పాటించడం లేదు. ఎప్పుడొస్తారో..ఎప్పుడు వెళ్తారో తెలియని పరిస్థితి నెలకొంది. ఫేషియల్ అటెండెన్స్ మాత్రం వేసి, వెళ్లిపోతుంటారు. పులివెందుల ప్రభుత్వ సర్వ జన ఆసుపత్రి గురించి ఎంత చెప్పినా తక్కువే. సకల వైద్య సౌకర్యాలతో ప్రజలకు కార్పొరేట్ వైద్య సేవలు అందించాల్సిన ఆసుపత్రి నిర్వీర్యంగా మారింది. ఇలా ప్రభుత్వ ఆసుపత్రులు పలు ఆరోపణలు ఎదుర్కొంటున్నాయి.

వ్యాధిగ్రస్తుల సంఖ్య ఎక్కువ...

ఇప్పుడిప్పుడే వ్యాధుల తీవ్రత పెరిగిపోతోంది. కలుషిత నీరు, అపరిశుభ్రత వాతావరణం తదిర కారణాల వల్ల వైరల్ ఫీవర్స్, టైఫాయిడ్ జ్వరాలు సంక్రమిస్తున్నాయి. జాగ్రత్తలు పాటించి, సరైన మందులు వాడితే ఒక వారంలో జ్వరం తగ్గుముఖం పడుతుంది. అలాగే డయేరియా కేసులు కూడా నమోదవుతున్నాయి. వివిధ రకాల వ్యాధులతో గ్రామీణ, పట్టణ ప్రాంత ప్రజలతో ప్రభుత్వ ఆసుపత్రులతోపాటు ప్రైవేట్ ఆసుపత్రులు కిటకిటలాడుతున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రుల విశ్వాసం కోల్పోవడంతో చాలా మంది ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించి ఆర్థికంగా చితికి పోతున్నారు. వ్యాధుల సంఖ్య అధికారిక లెక్కల కంటే అనధికారికంగా అధిక సంఖ్యలో ఉన్నట్లుగా వైద్యులు చెపుతున్నారు.

వైద్య రంగంపై పాలకులకు చిన్న చూపు...

వైఎస్సార్‌సీపీ పాలనలో వైద్య రంగం విలసిల్లింది. ప్రభుత్వ ఆసుపత్రులు ఆధునిక సౌకర్యాలతో ఉండేవి. ఏ వ్యాధి వచ్చినా సత్వర వైద్య సేవలు లభించేవి. ఫ్యామిలీ ఫిజీషియన్ విధానం సక్రమంగా అమలైంది, వైద్య రంగానికి సంబంధించిన 108 అంబులెన్స్, 104 సంచార వైద్య శాల తదితర విభాగలు విజయవంతగా అమలు అయ్యేవి. ఇప్పుడు కూటమి పాలనలో ఆ రంగాలన్నీ కుదేలయ్యాయి. వైద్య రంగంపై చిన్న చూపు చూస్తోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

» మందుల కొరత



జిల్లాలో కడప నగరంలో ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (పెద్దాసుపత్రి), ప్రొద్దుటురులో జిల్లా ఆసుపత్రి, పులివెందులలో సర్వజన ఆసుపత్రి, వైద్య విధాన పరిషత్‌లో పోరుమామిళ్ల, మైదుకూరు, చెన్నూరు, బద్వేల్, సిద్ధవటం, కమలాపురం, వేంపల్లెలో కలిపి మొత్తం 7 కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లు ఉన్నాయి. ఈ ఆసుపత్రిల్లో దాదాపుగా అన్ని వ్యాధులకు వైద్య సేవలు అందించాలి. ఏదైనా పెద్ద జబ్బు, సమస్యతో కూడకున్నదైతే కడప రిమ్స్‌లో వైద్యం చేయాలి. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో 51 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 24 పట్టణ ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. ఒక ఆసుపత్రిలో 172 రకాల మందులను అందుబాటులో ఉంచాలి, 60 రకాల వైద్య పరీక్షలు నిర్వహించాలి. అలాగే విలేజ్ హెల్త్ క్లినిక్‌లు 342 ఉన్నాయి. ఒక క్లినిక్ ద్వారా 108 రకాల మందులు, 14 రకాల వైద్య పరీక్షలు నిర్వహించాలి. చాలా వరకు ఆసుపత్రుల్లో మందులకు కొరత ఏర్పడింది. జ్వరం, జలుబు, దగ్గుకు మందులకు కొరత ఉంది అలాగే చక్కెర వ్యాధిని నియంత్రించే ఇన్సూలిన్ ఇంజక్షన్‌లు అందుబాటులో లేవు. కొన్ని ఆసుపత్రులు ప్రక్కన ఉన్న ఆసుపత్రుల నుంచి లేని మందులను తెచ్చుకొని రోగులకు ఇస్తున్నారు. ఏమని అడిగితే...సెంట్రల్ డ్రగ్స్ స్టోర్ నుంచి మందులు రావాల్సి ఉందని వైద్య సిబ్బంది చెపుతున్నారు.

జిల్లాలో జనవరి 1 నుంచి జూన్ 23 వరకు నమోదైన వ్యాధుల వివరాలు

వ్యాధులు	సంఖ్య
మలేరియా	03
డెంగ్యూ	76
చికున్‌గున్యా	06
డయేరియా	1,276
టైఫాయిడ్	261

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శుల నియామకం



ఎస్. గురుమోహన్



కె. నాగేంద్రారెడ్డి



ఆర్.వెంకట సుబ్బారెడ్డి

కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్ కడప జిల్లాకు చెందిన సింగసాని గురుమోహన్, కల్లూరు నాగేంద్రారెడ్డి, రెడ్యం వెంకట సుబ్బారెడ్డిలను రాష్ట్ర కార్యదర్శులుగా (పార్లమెంటు) నియమించినట్లు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాలను వీరికి కేటాయించడం జరుగుతుందని, వీరు పార్టీ కేంద్ర కార్యాలయంతో సమన్వయం చేసుకుంటూ సంబంధిత రీజనల్ కో ఆర్డినేటర్లు, పార్లమెంటు నియోజకవర్గ పరిశీలకులకు సహాయ కారిగా వ్యవహరించనున్నారు. కాగా సింగసాని గురుమోహన్ బద్వేల్ మున్సిపల్ వైస్ చైర్మన్‌గా, కడప అర్బన్ డెవెలప్‌మెంట్ అథారిటీ చైర్మన్‌గా పనిచేశారు. కల్లూరు నాగేంద్రారెడ్డి ప్రొద్దుటూరు మండల కన్వీనర్‌గా, జిల్లా ప్రధాన కార్యదర్శి, జిల్లా పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు. రెడ్యం వెంకట సుబ్బారెడ్డి ఆర్టీసీ జోనల్ చైర్మన్‌గా పనిచేశారు. వీరు పార్టీకి అందించిన సేవలను గుర్తించి ఈ పదవులు ఇచ్చినట్లు తెలుస్తోంది.

వైఎస్సార్‌సీపీ నేతలపై కక్ష సాధింపు

జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి



పీ రవీంద్రనాథరెడ్డి, వైఎస్ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షులు



రాచమల్లు శివప్రసాదరెడ్డి, మాజీ ఎమ్మెల్యే

వల్లూరు: వైఎస్సార్‌సీపీ పోరాటాలతో సీఎం చంద్రబాబు వెన్నులో వణుకు పుట్టిందని, అందుకే ఆయన ఆ పార్టీ నేతలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతూ లేనికేసులు సృష్టించి అణచివేతకు పాల్పడుతున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పోచిమరెడ్డి రవీంద్రనాథరెడ్డి అన్నారు. కడప వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడారు. లేని మద్యం కేసు సృష్టించి జగన్ చుట్టూ వున్న వారిని అరెస్టు చేసేందుకు ఎల్లో మీడియాతో కలిసి డ్రామాలాడుతున్నారని అన్నారు. ఎంపీ మిథున్‌రెడ్డిని అక్రమ కేసులో ఇరికించడం అందులో భాగమేనని ఉదహరించారు. కేసుకు సంబంధించి ఎక్కడైనా డబ్బు సీజ్ చేయడం, పెట్టుబడులు పెట్టినట్లుగానీ ఆధారాలు లేకున్నా.. నోటి మాటతో కథలు అల్లుతున్నారని విమర్శించారు. ఏడు కేసుల్లో బెయిల్‌పై వున్న చంద్రబాబునాయుడు తనపై కేసులన్నింటినీ నీరు గార్చడానికి ప్రయత్నిస్తూ కక్షసాధింపు రాజకీయాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు.

మిథున్ రెడ్డి అరెస్ట్ అప్రజాస్వామికం:రాచమల్లు

ప్రొద్దుటూరు: వైఎస్సార్‌సీపీ రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్ట్ అప్రజాస్వామికమని, కేవలం కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే ఆయనను అరెస్టు చేశారని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. మిథున్‌రెడ్డి అక్రమ అరెస్ట్‌పై రాచమల్లు శనివారం రాత్రి హైదరాబాద్ నుంచి వీడియో విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం 13 నెలల పాలనలో అక్రమ అరెస్టులు తప్పా ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. సిట్ అధికారులు లిక్కర్ కేసులో ఇంత వరకు ఒక్క రూపాయిని కూడా సీజ్ చేయలేదన్నారు. సంస్థలో పనిచేసే చిన్న ఉద్యోగులపై ఒత్తిడి తెచ్చి తప్పుడు స్టేట్‌మెంట్లతో ప్రముఖ నేతలను ఇరికించారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబంపై కక్షసాధింపు చర్యలు జరుగుతున్నాయని తెలిపారు. వ్యక్తిగత కక్షతో పెద్దిరెడ్డి కుటుంబాన్ని బాధించేందుకే మిథున్‌రెడ్డిని అరెస్ట్ చేశారన్నారు. ఆధారాలు లేని కేసులు కోర్టులో నిలబడవన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఏ విత్తనం వేస్తోందో భవిష్యత్తులో అదే ఫలం వస్తుందని హెచ్చరించారు.


ఎన్నాళ్లీ.. ఎదురుచూపులు!



ఇతని పేరు ఆదినారాయణరెడ్డి. ఊరు పెండ్లిమర్రి మండలం కొనాయపల్లె. ఐదు ఎకరాల మెట్ట పొలం ఉంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు మినుము, బుడ్డ శనగ సాగు చేయాలని భావిస్తున్నాడు. అందుకోసం విత్తనాలు అవసరం. ప్రభుత్వం అన్నదాత సుఖీభవ నిధులను విడుదల చేస్తే పంటలసాగుకు ఆసరాగా ఉంటుందని, విత్తనాలు, ఎరువులను తెచ్చుకునేందుకు వీలుగా ఉంటుందని ఆశగా ఎదురు చూస్తున్నాడు. ఆలస్యం చేస్తే సాగుకైన దూరం కావాల.. లేదంటే బయట వ్యక్తుల వద్ద అప్పైన చేయాల. జిల్లా వ్యాప్తంగా రైతుల దుస్థితి ఇది.

- అన్నదాత సుఖీభవ నిధుల విడుదలెప్పుడో
- ఈకేవైసీ పూర్తయినా నిధుల విడుదలపై స్పష్టత ఇవ్వని సర్కార్
- విత్తనాలు, ఎరువుల కోసం అన్నదాతలు అప్పులు

కడప అగ్రికల్చర్: 'మా ప్రభుత్వం అధికారంలోకి వస్తే రైతులకు పెట్టుబడి సాయం కింద ఏటా రూ. 20 వేలు అందజేస్తాం. ఎరువుల, విత్తనాలను సకాలంలో సరఫరా చేస్తాం. ఎక్కడ ఎరువుల కొరత లేకుండా చేస్తాం..' ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఊదరకొట్టిన మాటలివి. అనుకున్నట్టే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. వారు అన్నదాతలకిచ్చిన వాగ్దానాలు మాత్రం గాలిలో కలిసి పోయాయి. ఒక్క హామీ నెరవేర్చకపోవడంతో రైతులు ఎరువులు, విత్తనాల కోసం పరుగులు తీస్తున్నారు. అన్నదాత సుఖీభవ నిధుల కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఖరీఫ్, రబీ రెండు సీజన్లు



పంటలు సాగు చేస్తున్న రైతులు

ముగిశాయి. రెండు సీజన్లకు ఒక్క రుపాయి కూడా విడదల కాలేదు. మళ్లీ తాజాగా ఖరీఫ్ సీజన్ ప్రారంభమై సుమారు రెండు నెలలు కావొస్తుంది. ప్రస్తుతం జిల్లాలో వర్షాలతోపాటు కేసీ కాలువకు నీటిని కూడా వదిలారు. ఇక అన్నదాతలు కాడీ మేడీ సిద్ధం చేసుకుని సాగుకు సన్నద్ధమతున్నారు. ఇప్పుడు రైతన్నలకు పెట్టుబడి సాయం అవసరం. విత్తనాలు, ఎరువులను తెచ్చుకునేందుకు డబ్బులు ఎంతో అవసరం. కానీ కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ నిధులకు సంబంధించి ఇప్పటికి ఒక క్లారిటి ఇవ్వలేదు. ఇటీవలే రైతు భరోసాకు సంబంధించి రైతుల నుంచి ఈకేవైసీ కూడా తీసుకున్నారు. కానీ నిధుల విడుదలపై స్పష్టత ఇవ్వలేదు. దీంతో అన్నదాతలు ఊసూరుమంటున్నారు. జిల్లావ్యాప్తంగా ఈ ఏడాది 77475 హెక్టార్లలో వివిధ పంటలు సాగుకానున్నాయి.

- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 205600 మంది రైతులకు రైతు భరోసా ఇవ్వగా ఈ ఏడాది ఈకేవైసీ పేరుతో దాదాపు 9700 మంది రైతులకు జిల్లాలో కోత విధించి 1,95,892 మంది రైతులు అర్హులుగా గుర్తించినట్లు తెలిసింది. వీరికైనా సకాలంలో నిధులను విడుదల చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

తంచన్‌గా కేంద్ర ప్రభుత్వ సాయం...

పీఎం కిసాన్ పథకంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం రైతులకు తంచన్‌గా సాయం అందిస్తోంది. ఇందులో భాగంగా మూడు విడతల్లో 6 వేలు సాయం అందచేస్తామని ప్రకటించింది. ఈ మేరకు గతేడాది జూన్ నెలలో రూ. 2 వేలు, అక్టోబర్‌లో 2 వేలుతోపాటు ఈ ఏడాది మార్చి నెలలో మూడవ విడదను విడుదల చేసింది. ఇలా జిల్లావ్యాప్తంగా గతేడాది 1.89 లక్షల మంది రైతులకు ఒకొక్కరికి 2 వేల చొప్పున రూ. 37.88 కోట్లు రైతుల ఖాతాల్లో జమచేసింది.


»» వైఎస్సార్ సీపీ ఐదేళ్ల పాలనలో...

వైఎస్సార్ సీపీ అధికారంలో ఉన్న ఐదెళ్లలో పంటల సాగుకోసం క్రమం తప్పకుండా పెట్టుబడి సాయం అందించింది. ఏటా ఖరీఫ్ ఆరంభంలోనే పెట్టుబడి సాయాన్ని అందించి పంటలసాగుకు చేయూత నిచ్చింది. కానీ కూటమి ప్రభుత్వంలో పంటలసాగుకు అన్నదాతలకు అవస్థలు తప్పడం లేదు. దీనికితోడు గత ఖరీఫ్, రబీ సీజన్‌లలో అకాల వర్షాలు, తుఫాలతో రైతులు తీవ్రంగా నష్టాలను చవిచూశారు. వారిని కూడా కూటమి ప్రభుత్వం ఆదుకోలేదు. అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలకు ఇన్‌పుట్ సబ్సిడి కూడా ఇవ్వలేదు. ఇటు ఇన్‌పుట్ సబ్సిడీ అందక.. అటు అన్నదాత సుఖీభవ నిధులు రాక జిల్లా రైతులు నష్టపోయారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విడుదల చేసిన రైతు భరోసా, పీఎం కిసాన్ నిధులు వివరాలు ఇలా..

సంవత్సరం	రైతుల సంఖ్య	విడుదలైన నిధులు (కోట్లలో)
2019-20	206708	279.93
2020-21	208747	280.06
2021-22	199344	269.11
2022-23	202598	235.68
2023-24	205600	277.56

ఎదురుచూడటం తప్ప...



అన్నదాత సుఖీభవ నిధుల కోసం ఎదురుచూస్తున్నాం. గతేడాది ఒక్క రుపాయి కూడా విడుదల చేయలేదు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ కూడా ప్రారంభమయింది. వర్షాలు పడుతున్నాయి. పంటలను సాగు చేసేందుకు సిద్ధమవుతున్నాం. ఇప్పటికైనా అన్నదాత సుఖీభవ నిధులను ఇస్తే పెట్టుబడికి సాయంగా ఉంటుంది. – చిన్న సుబ్బరాయుడు, కానపల్లి, పొద్దుటూరు మండలం

రెండేళ్ల నిధులు ఇవ్వాలి



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటింది. గతేడాది రైతులకు ఇవ్వాల్సిన అన్నదాత సుఖీభవ నిధులు ఇవ్వలేదు. దీంతో చాలా మంది రైతులు నష్టపోయారు. గతేడాది అన్నదాత సుఖీభవ నిధులతో కలిసి ఈ ఏడాది నిధులను ఇచ్చి రైతులను ఆదుకోవాలి.– భాస్కర్, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, సీపీఐ

భూమి ఉన్న ప్రతి రైతుకు ఇవ్వాలి



అన్నదాత సుఖీభవ నిధులను భూమి ఉన్న ప్రతి రైతుకు ఇవ్వాలి. అలాగే కౌలు రైతులకు కూడా ఇవ్వాలి. ఈకేవైసీ పేరుతో జాబితా నుంచి రైతుల పేర్లను తొలగించచడం అన్యాయం. దీంతో చాలా మంది రైతులు అన్నదాత సుఖీభవ నిధులు రాక నష్టపోనున్నారు. –దస్తగిరిరెడ్డి, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి, సీపీఎం

క్లుప్తంగా

నిబంధనల మేరకే విధులు నిర్వహిస్తున్నాం

– 'అవినీతి కేంద్రం కారాగారం' కథనంపై సూపరింటెండెంట్ వివరణ

కడప అర్బన్ : కడప కేంద్ర కారాగారంలో నిబంధనల మేరకే విధులు నిర్వహిస్తున్నామని కడప కేంద్ర కారాగారం సూపరింటెండెంట్ రాజేశ్వరరావు తెలిపారు.అవినీతి కేంద్రం కారాగారం' శీర్షికన్న సాక్షి'లో ప్రచురితమైన కథనంపై ఆయన వివరణ ఇచ్చారు. శనివారం ఈమేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్ర కారాగారంలోకి బయటినుంచి సెల్‌ఫోన్‌లను విసిరేస్తున్నారని, పట్టుబడిన సెల్‌ఫోన్‌ల గురించి రిమ్స్ పోలీస్ స్టేషన్‌లో ఎఫ్.ఐ.ఆర్‌లను నమోదు చేయించామన్నారు. బయటి వైపు గస్తీ ఎక్కువగా చేయించాలని రిమ్స్ పోలీసులను కోరామని తెలిపారు.

ఆవు-ఎద్దులను ఢీకొన్న కారు

సిద్దవటం : మండలంలోని చాముండేశ్వరీపేట గ్రామం సెయింట్ ఆంథోనీ హైస్కూల్ సమీపంలో శనివారం ఆవు-ఎద్దులను కారు ఢీకొన్న ప్రమాదంలో ఆవు, ఎద్దు అక్కడికక్కడే మృతి చెందాయి. కడప- చెన్నై జాతీయ రహదారిలో ఈ ప్రమాదం జరిగింది. మేతకు రైల్వే ట్రాక్ అవతలికి వెళ్లి తిరిగి నేకనాపురం గ్రామానికి వెళ్లేందుకు ఆవు, ఎద్దు రోడ్డు దాటుతుండగా కడప నుంచి రాజంపేట వైపు వెళుతున్న కారు వేగంగా వచ్చి ఆవు, ఎద్దులను ఢీకొంది. ఈ ప్రమాదంలో నేకనాపురం గ్రామ పాడి రైతులు సుబ్బారెడ్డి, రవీంద్రారెడ్డిలకు చెందిన ఆవు, ఎద్దు మృతి చెందాయి. సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్ఐ మహమ్మద్‌రఫీ కారు డ్రైవర్ అబ్దుల్లాను విచారించారు.

అదుపు తప్పిన చైతన్య స్కూల్ బస్సు

రాయచోటి టౌన్ : రాయచోటిలోని శ్రీ చైతన్య పాఠశాలకు చెందిన బస్సు అదుపు తప్పి ఒక వైపు ఒరిగిపోయింది. దీంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు అంటున్నారు. శనివారం రాయచోటికి చెందిన శ్రీ చైతన్య స్కూల్ బస్సు సుండుపల్లె నుంచి రాయచోటికి వస్తుండగా శిబ్యాల గ్రామం అనుంపల్లె సమీపంలో బస్సు బ్రేక్‌లు పని చేయకపోవడంతో ఒక్కసారిగా సైడు కాలువ వైపు ఒరిగిపోయింది. అక్కడ మరో చిన్న కాలువ ఉండటంతో అందులో ముందు వైపు టైర్ ఇరుక్కుపోవడంతో ఆగిపోయింది. ఈ కాలువ లేకుంటే సైడ్ కాలువలో పడి చిన్నారులకు గాయాలయ్యేవి. ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

గొంతు కోసుకుని ఆత్మహత్యాయత్నం

మదనపల్లె రూరల్: బి.కొత్తకోట మండలంలో జరిగింది. రంగసముద్రం పంచాయతీ కుర్రావాండ్లపల్లెకు చెందిన నరేష్‌బాబు అలియాస్ భూషణ(27) స్థానికంగా డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం పూటుగా మద్యం తాగి వ్యక్తిగత సమస్యలతో మనస్తాపం చెంది బ్లేడుతో గొంతు కోసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స కోసం మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

దళితుల రోడ్డును ధ్వంసం చేశాడు



టీడీపీ నేత ధ్వంసం చేసిన రోడ్డును పరిశీలిస్తున్న ఎస్ఐ చిన్న పెద్దయ్య



ధ్వంసం చేసిన దారిలో ఇబ్బంది పడుతూ వెళుతున్న దళితులు

చాపాడు మండలం తిప్పిరెడ్డిపల్లెలో టీడీపీ నేత దుశ్చర్య

చాపాడు : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్ల క్రితం.. 30 ఏళ్లుగా సిమెంట్ రోడ్డుకు నోచుకోని మండలంలోని తిప్పిరెడ్డిపల్లె ఎస్సీ కాలనీ(దళితవాడ)కి మెయిన్ రోడ్డు నుంచి 2019–20లో 14వ ఆర్థిక సంఘం, ఉపాధి హామీ పథకం కింద రూ.4లక్షలతో ప్రభుత్వం సిమెంట్ రోడ్డు నిర్మించింది. ఆ సమయంలో రోడ్డు నిర్మాణం చేపట్టే స్థలం తమదని మండలంలోని అనంతపురం గ్రామానికి చెందిన టీడీపీ నేత నందిమండలం మల్లికార్జునరెడ్డి అడ్డుపడ్డాడు. ఎస్సీ కాలనీ లేఅవుట్‌లో దారి స్థలం ఇదేనని అధికారులు తేల్చడంతో సిమెంట్ రోడ్డు నిర్మాణం చేపట్టారు. అప్పటి నుంచి ఐదేళ్ల పాటు ఈ రోడ్డు నిర్మాణంపై ఎలాంటి సమస్యలు తలెత్తలేదు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది తర్వాత టీడీపీ నేత మల్లికార్జునరెడ్డి శనివారం ఉదయం తన అనుచరులతో వచ్చి జేసీబీతో 40 కుటుంబాల వారు నివసిస్తున్న దళితవాడకు వెళ్లే సిమెంట్ రోడ్డు పూర్తిగా తొలగించి ధ్వంసం చేయించాడు. ఈ సమయంలో దళితవాడకు చెందిన వారందరూ ఉపాధి హామీ పనులకు వెళ్లగా అక్కడ ఉండే కొంత మంది రోడ్డు తొలగింపును అడ్డుకునేందుకు ప్రయత్నించగా తమను బెదిరించారని తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న దళితులందరూ ఇంటికి రాగా అప్పటికే వారి ఇళ్లకు వెళ్లే రోడ్డు పూర్తిగా ధ్వంసం అయి ఉంది. దీంతో ఫోన్ల ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లగా పంచాయతీ కార్యదర్శి మల్లేశ్వరి సంఘటన స్థలాన్ని పరిశీలించి దళితులను విచారించారు. ఈ రోడ్డును టీడీపీ నేత మల్లికార్జునరెడ్డి తొలగించినట్లు వారు ఎంపీడీఓ వీరకిషోర్‌కు తెలిపారు. ఈ క్రమంలో విషయం తెలుసుకున్న ఎస్ఐ చిన్న పెద్దయ్య సంఘటనా స్థలం వద్దకు చేరుకుని రోడ్డు తొలగింపును పరిశీలించారు. ఈ చర్యను అడ్డుకోబోగా అనంతపురం, ఓబాయపల్లె, నక్కలదిన్నె గ్రామాలకు చెందిన టీడీపీ వర్గీయులు చంపుతామని బెదిరించి భయాందోళనకు గురి చేసినట్లు వారు ఎస్ఐ దృష్టికి తీసుకువచ్చారు. రోడ్డు తొలగింపు ఘటన కారకులపై చర్యలు తీసుకోవాలని స్థానిక దళితులు ఎస్ఐ చిన్న పెద్దయ్య, డిప్యూటీ తహసీల్దారు కృష్ణారెడ్డికి రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ స్థలంపై తనకు హక్కు ఉందని కోర్టులో దీనిపై కేసు నడుస్తోందని స్టే కూడా ఉందని మల్లికార్జునరెడ్డి చెబుతున్నాడు.

ఎంపీడీఓ ఏమన్నారంటే..

తిప్పిరెడ్డిపల్లె దళితవాడకెళ్లే రోడ్డును టీడీపీ నేత తొలగించడంపై ఎంపీడీఓ వీర కిషోర్‌ను వివరణ కోరగా.. ప్రభుత్వ నిధులతో వేసిన రోడ్డును తొలగించడం చట్టరీత్యా నేరమన్నారు. రోడ్డు తొలగింపు, స్థల సమస్యపై రెవెన్యూ అధికారులతో కలసి సమగ్ర విచారణ చేపట్టి తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

టీడీపీ నేత మల్లికార్జునరెడ్డికి ఎలాంటి సంబంధం లేదు : దళితులు

30 ఏళ్ల క్రితం ఊరి బయట ఉన్న తాము ఇళ్ల నిర్మించుకునేందుకు పామిడి బుడ్డయ్య కుమారుడు వీరయ్య నుంచి ఇంటింటికి చందాలు వేసుకుని 70 సెంట్ల స్థలం కొనుగోలు చేశామని దళితులు చెబుతున్నారు. ఈ క్రమంలో తమ కాలనీ పెద్ద మనిషి గయన్నతో పాటు మరికొందరు పెద్ద మనుషుల నిర్ణయంతో ఊర్లో పెద్ద మనిషిగా ఉన్న నందిమండలం వీరారెడ్డి పేరుతో స్థలం రాయించుకున్నామన్నారు. అప్పటి నుంచి వీరారెడ్డి పేరు మీదనే స్థల పత్రాలు ఉన్నాయన్నారు. వీరారెడ్డి తమ్ముడి కుమారుడు అయిన పడమర అనంతపురం గ్రామంలో ఉన్న టీడీపీ నేత మల్లికార్జునరెడ్డి ఈ స్థలం తమ పెదనాన్నదని తనకు హక్కు ఉందని వస్తున్నాడని, గతంలో అధికారులు చెప్పినా వినకుండా ఇప్పుడు ఇలా దౌర్జన్యంగా రోడ్డును తొలగించాడని దళితులు వాపోతున్నారు.

సమస్యలు పరిష్కరించేవరకు
పనులు జరగనివ్వం

- టెయిలింగ్ పాండ్ వద్ద పనులు నిలిపివేయాలని గ్రామస్తుల నిరసన
- యురేనియం అధికారులు చర్చించినా పట్టువీడని బాధితులు
- నిలిచిపోయిన పనులు



గ్రామస్తులతో చర్చిస్తున్న యురేనియం అధికారులు

వేముల : తమ సమస్యలు పరిష్కరించేవరకు టెయిలింగ్ పాండ్ వద్ద ఎలాంటి పనులు జరగనివ్వమని.. సమస్యలపై స్పష్టత ఇచ్చాకే పనులు చేసుకోవాలని కె.కె.కొట్టాల గ్రామస్తులు యురేనియం అధికారులకు సూచించారు. శనివారం ప్రొక్లెయిన్ల సహాయంతో పనులు చేపట్టేందుకు యురేనియం అధికారులు ప్రయత్నించారు. ఈ విషయం తెలుసుకున్న కె.కె.కొట్టాల గ్రామస్తులు టెయిలింగ్ పాండ్ వద్దకు చేరుకుని పనులు చేయవద్దని నిరసనకు దిగారు. దీంతో యురేనియం అధికారులు బాధితులతో చర్చించినా వారు అంగీకరించలేదు. కాగా యురేనియం ముడి పదార్థాన్ని శుద్ధి చేయగా, వచ్చే వ్యర్థాలను కె.కె.కొట్టాల సమీపంలోని టెయిలింగ్ పాండ్‌కు తరలిస్తున్నారు. అయితే టెయిలింగ్ పాండ్ వ్యర్థాలతో నిండే స్థాయికి చేరుకుంది. దీంతో యురేనియం అధికారులు రోజుకు 3వేల టన్నుల ముడి పదార్థాన్ని శుద్ధి చేయాల్సి ఉన్నా.. టెయిలింగ్ పాండ్ తొందరగా నిండిపోయే ప్రమాదం ఉండటంతో ప్రస్తుతం రోజుకు 1500 టన్నులు మాత్రమే ముడి పదార్థాన్ని శుద్ధి చేస్తున్నారు. ఈ లెక్కన ముడి పదార్థాన్ని శుద్ధి చేసిన నాలుగైదు నెలల్లో టెయిలింగ్ పాండ్ నిండుతుందని యురేనియం అధికారులు చెబుతున్నారు. అంతేకాక ఈ లోపు భారీ వర్షాలు కురిస్తే టెయిలింగ్ పాండ్ వర్షపు నీటితో పొర్లిపాయే ప్రమాదం ఉంది. దీంతో యురేనియం అధికారులు ప్రొక్లెయిన్ సహాయంతో టెయిలింగ్ పాండ్ వద్ద మట్టిని పోసే పనులను చేయాలని నిర్ణయించారు. దీంతో ప్రొక్లెయిన్లను సిద్ధంగా ఉంచుకుని పనులు ప్రారంభించేందుకు సిద్ధమయ్యారు. ఈ లోపు ఈ సమాచారం కె.కె.కొట్టాల గ్రామస్తులకు తెలియడంతో గ్రామస్తులు టెయిలింగ్ పాండ్ వద్దకు చేరుకున్నారు. తమ సమస్యలను పరిష్కరించకుండా పనులు చేయడానికి వీల్లేదనడంతో నిరసనకు దిగారు. యురేనియం వ్యర్థాలతో ఇప్పటికే తీవ్రంగా నష్టపోయామని వాపోయారు. యురేనియం వ్యర్థాలు దుమ్ము, ధూళి గాలి ద్వారా గ్రామం వైపు రావడంతో తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నామని వాదించారు. కిడ్నీ వ్యాధులు, గర్భస్రావాలు, చర్మ వ్యాధులు, క్యాన్సర్ వంటి వ్యాధులు సోకుతున్నాయని యురేనియం అధికారులకు విన్నవించారు. టెయిలింగ్ పాండ్ పనులు జరగాలంటే తమ సమస్యలను పరిష్కరించాల్సిందేనని పట్టుబట్టారు. రాత్రికి రాత్రే ప్రొక్లెయిన్లను టెయిలింగ్ లోనికి పంపి పనులు చేపట్టడంపై గ్రామస్తులు యురేనియం అధికారులను నిలదీశారు. ఇళ్లు, పొలాలు తీసుకుని పరిహారంతోపాటు ఉద్యోగావకాశాలు కల్పించాలని తర్వాతనే పనులు చేసుకోవాలని గ్రామస్తులు తేల్చి చెప్పారు. యురేనియం అధికారులు నవీన్‌కుమార్ రెడ్డి, టెయిలింగ్ పాండ్ ఇన్‌ఛార్జి నాగరాజులు గ్రామస్తులతో చర్చించారు. మీ సమస్యలకు పరిష్కారం చూపుతామని ఎలాంటి ఆందోళన చెందవద్దని గ్రామస్తులకు నచ్చజెప్పారు. మీ ప్రకారమే అన్ని జరుగుతాయని, అయితే ఇందుకు సమయం కావాలని, అప్పటివరకు పనులు చేసుకునేందుకు సహకరించాలని గ్రామస్తులకు సూచించారు. ఇందుకు గ్రామస్తులు తమ సమస్యలపై హామీ ఇచ్చిన తర్వాతనే పనులు చేసుకోవాలని, అంతవరకు టెయిలింగ్ పాండ్‌లో పనులు చేపట్టవద్దని, పనులు చేస్తే ధర్నాకు వెనుకాడమని హెచ్చరించారు. దీంతో టెయిలింగ్ పాండ్ వద్ద పనులు నిలిచిపోయాయి.

బాలిక హత్య కేసులో పోలీసుల తాత్సారం



డీఎస్పీతో మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకులు

జమ్మలమడుగు : గండికోటలో మైనర్ బాలికను హత్యచేసిన నిందితులెవరో పోలీసులకు తెలిసినా వివరాలను వెల్లడించడంలో ఎందుకు తాత్సారం చేస్తున్నారని విప్లవ రచయితల సంఘం నాయకురాలు వరలక్ష్మి ప్రశ్నించారు. శనివారం ప్రజా సంఘాల నాయకులతో కలిసి ఆమె ఎర్రగుంట్ల మండలం హనుమనగుత్తిలో బాధితురాలి తల్లిదండ్రులతో, బాలికను బైకుపై తీసుకెళ్లిన లోకేష్ తల్లితో మాట్లాడారు. అనంతరం డీఎస్పీ వెంకటేశ్వర్లును కలసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మైనర్ బాలిక హత్య జరిగిందని తెలిసిన వెంటనే లోకేష్‌ను పోలీసులు అదుపులోనికి తీసుకున్నారన్నారు. ఐదురోజులు గడిచినా ఇంతవరకు అతన్ని కోర్టు ముందు హాజరు పరచలేదన్నారు. నిందితులను గుర్తించేందుకు విచారణ చేస్తున్నామంటూ పోలీసులు కాలయాపన చేస్తున్నారనే విషయం స్పష్టమవుతోందన్నారు. నిందితుల వివరాలు ఎందుకు దాచిపెడుతున్నారో తమకు అర్థం కావడం లేదన్నారు. సంఘటన స్థలాన్ని కూడా తాము పరిశీలించామని, ఆ ప్రాంతం పూర్తిగా అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిపోయిందన్నారు. గండికోటలో టోల్‌గేట్ పెట్టి డబ్బులు వసూలు చేస్తున్నారే తప్ప ఎక్కడా సెక్యూరిటీ గాని సీసీ కెమెరాలు గాని లేవన్నారు. ఈ ప్రాంతానికి విదేశీ పర్యాటకులు సైతం ఎక్కువ సంఖ్యలో వస్తుంటారని, ఇలాంటి సంఘటనలు జరిగితే విదేశాల్లో సైతం మన పరువు పోతుందన్నారు. ఈ ప్రాంతంలో సెక్యూరిటీ పెంచి, పర్యాటకులకు భద్రత కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పౌరహక్కుల సంఘం నాయకులు, న్యాయవాదులు, మహిళా సంఘాలు, సీపీఎం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ప్రవర్తన మార్చుకోలేదని భార్యను కడతేర్చాడు

- మృతదేహాన్ని గోనె సంచిలో తీసుకెళ్లి ఎద్దడుగు కనుమలో పడేశాడు
- పోలీసుల అదుపులో భర్త గోపాల్



సుజాత(ఫైల్)



భర్త గోపాల్(ఫైల్)



సుజాత మృతదేహం వద్ద పరిశీలిస్తున్న డీఎస్పీ రాజేంద్రప్రసాద్

చాపాడు : ప్రవర్తన బాగా లేకపోవడంతో పద్ధతి మార్చుకోవాలని రెండేళ్లుగా భర్త చెబుతూ వస్తున్నాడు .. భార్య వివాహేతర సంబంధంపై పలుమార్లు పోలీసు స్టేషన్‌లో పంచాయితీలు జరిగాయి. అయినా ఆమెలో మార్పు రాకపోవడంతో భార్యను హతమార్చి శవాన్ని గోనె సంచిలో తీసుకెళ్లి మైదుకూరు – పోరుమామిళ్ల మధ్య గల ఎద్దడుగు కనుమలో పడేసిన ఘటన శనివారం మండలంలోని చియ్యపాడులో జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు..

చాపాడు మండలం చియ్యపాడు గ్రామానికి చెందిన నల్లబోతుల సుజాత(40)ను ఆమె భర్త నల్లబోతుల గోపాల్ ఈ నెల 17న గొంతు నులిమి హత్య చేశాడు. ప్రైవేటు ట్రావెల్స్ బస్సు డ్రైవర్‌గా ఉంటున్న గోపాల్ తన అక్క పార్వతమ్మ కూతురు అయిన సుజాతను 20 ఏళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. గత రెండేళ్ల క్రితం నుంచి తన ఇంటి నిర్మాణం చేస్తున్న చియ్యపాడు దళితవాడకు చెందిన బేల్దారి బాబుతో సుజాతకు పరిచయం ఏర్పడి అది వివాహేతర సంబంధంగా మారింది. ఈ విషయం తెలుసుకున్న భర్త గోపాల్ పలు సార్లు భార్య సునీతను పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించాడు. అయినప్పటికీ వివాహేతర సంబంధం కొనసాగుతోంది. ఈ పంచాయితీ పలు సార్లు చాపాడు పోలీసు స్టేషన్‌కు సైతం వచ్చింది. ఇదే విషయంలో బాబుపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు కూడా తరలించారు. అయినప్పటికీ సుజాత, బాబు వివాహేతర సంబంధం కొనసాగుతుండడంతో ఈ నెల 17న రాత్రి గోపాల్, సుజాత గొడవ పడ్డారు. తన మాట వినలేదనే కారణంతో రాత్రి 11 గంటల ప్రాంతంలో గోపాల్ తన భార్యను గొంతు నులిమి చంపేశాడు. ఈ విషయం బయటికి పొక్కకుండా సుజాత శవాన్ని గోపాల్ గోనే సంచిలో కట్టుకుని తన బైక్‌లో మైదుకూరు – పోరుమామిళ్ల రహదారి మధ్యలో గల ఎద్దడుగు కనుమలోని ఓ ముళ్లపొద గుంతలో పడేశాడు. గ్రామంలోనే ఉన్న సుజాత తల్లి పార్వతమ్మ తన కూతురు కన్పించలేదని పోలీసుకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు రూరల్ సీఐ శివశంకర్, ఎస్ఐ చిన్న పెద్దయ్య ఈ ఘటనపై గోపాల్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టగా స్వయంగా తానే సుజాతను హత్య చేసినట్లు ఒప్పుకున్నాడు. ఎద్దడుగు కనుమలో పడేసిన శవం వద్దకెళ్లి డీఎస్పీ రాజేంద్రప్రసాద్, రూరల్ సీఐ, ఎస్ఐ పరిశీలించారు. సుజాత మృతదేహం కుళ్లిపోవడంతో బయటికి తీసేందుకు వీలు కాక అక్కడే పంచానామా నిర్వహించారు. పార్వతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ సీఐ తెలిపారు.

టీడీపీలో భగ్గుమన్న విభేదాలు

- ద్విచక్రవాహనంపై వెళుతుండగా కారుతో ఢీకొట్టి రాళ్లతో దాడి చేసిన వైనం
- ఇద్దరికి తీవ్ర గాయాలు.. పరిస్థితి విషమం
- కడపలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలింపు



దాడి వివరాలను అడిగి తెలుసుకుంటున్న డీఎస్పీ, సీఐ

తొండూరు : అధికార టీడీపీలో వర్గ విభేదాలు మరోసారి భగ్గుమన్నాయి. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గతంలో తొండూరు మండలం ఇనగలూరు గ్రామంలో అధికార పార్టీకి చెందిన దస్తగిరిరెడ్డి (బాబురెడ్డి), అదే పార్టీకి చెందిన బాల ఓబుళరెడ్డిల మధ్య ఉపాధి హామీలో చీనీ బిల్లుల విషయమై ఇరువర్గాలు ఘర్షణ పడ్డారు. ఈ నేపథ్యంలో దస్తగిరిరెడ్డి తమకు బిల్లులు రాకుండా అడ్డుకున్నారని బాల ఓబుళరెడ్డి వర్గీయులు ఈ ఏడాది జనవరి మాసంలో దస్తగిరిరెడ్డిపై దాడి చేశారు. దీంతో అప్పటి నుంచి బాల ఓబుళరెడ్డి వర్గీయులు జైలు నుంచి వచ్చిన తర్వాత ఇనగలూరు గ్రామానికి వెళ్లకుండా బయట తిరిగేవారు. నెల రోజుల క్రితం పోలీసులు ఇరువర్గాల వారికి కౌన్సిలింగ్ ఇచ్చి ఎలాంటి ఘర్షణలకు దిగకుండా అందరూ ఐకమత్యంగా ఉండాలని సూచించారు. దీంతో బాల ఓబుళరెడ్డి వర్గీయులు ఇనగలూరు గ్రామంలోకి వెళ్లి పనులు చేసుకుంటుండేవారు. శనివారం బాల ఓబుళరెడ్డి కుమారులు సమరసింహారెడ్డి, హరికిశోర్‌రెడ్డిలు ద్విచక్రవాహనంపై ఇనగలూరు నుండి పులివెందులకు వస్తుండగా సైదాపురం బస్టాప్ దాటగానే వెనుకవైపు నుంచి దస్తగిరిరెడ్డితోపాటు మరికొంతమంది కారులో వచ్చి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టి సమర సింహారెడ్డి, హరికిశోర్‌రెడ్డిలపై రాళ్లతో దాడి చేశారు. దీంతో వారి తలకు బలమైన రక్తపు గాయాలతో పాటు కాలు విరిగినట్లు తెలిసింది. దాడి జరిగే సమయంలో కొంతమంది స్థానికులు వచ్చి గాయపడిన వారిని 108 వాహనంలో పులివెందుల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న సమరసింహారెడ్డి, హరికిశోర్‌రెడ్డిలను పులివెందుల డీఎస్పీ మురళీ నాయక్, సీఐ వెంకటరమణలు దాడి జరిగిన సంఘటన గురించి ఆరా తీశారు. అక్కడి వైద్యులు చికిత్స అందించి పరిస్థితి విషమంగా ఉండటంతో కడపకు రెఫర్ చేశారు. ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ సంఘటనపై పులివెందుల రూరల్ సీఐ వెంకటరమణ, ఎస్ఐ ఘన మద్దిలేటిలు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దుండగుల దుశ్చర్య



మునయ్యకోనలోని శివాలయంలో చెల్లాచెదురుగా సామగ్రి

ముద్దనూరు : ముద్దనూరు–జమ్మలమడుగు ఘాట్‌రోడ్డులో గుర్తుతెలియని వ్యక్తులు దుశ్చర్యకు పాల్పడ్డారు. పురాతన మునయ్యకోనలోని శివాలయంలోకి ప్రవేశించి బీరువాను పగలగొట్టి అందులోని పూజా, దేవతా సామగ్రిని చెల్లాచెదురు చేశారు. స్థానిక ఎత్తులేటికట్ట సమీపంలోని ఏసుక్రీస్తు విగ్రహం రెండు చేతులను పగలగొట్టారు. శుక్రవారం రాత్రి ప్రొద్దుపోయిన తర్వాత ఈ రెండు సంఘటనలు జరిగి ఉండవచ్చని స్థానికులు భావిస్తున్నారు. జనసంచారం లేని ఈ ఘాట్‌రోడ్డు ప్రాంతంలో ఇలాంటి ఘటనలు జరగడంతో ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు.

కర్నూలు, నెల్లూరు జట్ల విజయం



సాయి విఘ్నేష్, కర్నూలు (6 వికెట్లు)



దేవాన్ష్, అనంతపురం (5 వికెట్లు)

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఏసీఏ అండర్–16 మల్టీ డే మ్యాచ్‌లో శనివారం మూడో రోజు కర్నూలు, నెల్లూరు జట్లు విజయం సాధించాయి. వైఎస్ఆర్ఆర్ క్రికెట్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో కడప జట్టు రెండవ ఇన్నింగ్స్‌లో 39.2 ఓవర్లకు 117 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టులోని సీఎండీ ఫైజాన్ 30 పరుగులు, గైబు 35 పరుగులు చేశారు. కర్నూలు జట్టులోని సాయి విఘ్నేష్ అద్భుతంగా బౌలింగ్ చేసి 6 వికెట్లు తీశాడు. రుత్విక్ కళ్యాణ్ 2 వికెట్లు, వివేక్ 2 వికెట్లు తీశారు. దీంతో కర్నూలు జట్టు 66 పరుగులతో విజయం సాధించింది. కర్నూలు జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 157 స్కోరు, రెండవ ఇన్నింగ్స్‌లో 140 స్కోరు చేసింది. కడప జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 114 పరుగులు, రెండవ ఇన్నింగ్స్‌లో 117 పరుగులు మాత్రమే చేసింది.

కేఓఆర్ఎం క్రికెట్ మైదానంలో...

కేఓఆర్ఎం క్రికెట్ మైదానంలో శనివారం మూడో రోజు నెల్లూరు–అనంతపురం జట్ల మధ్య మ్యాచ్ కొనసాగింది. 225 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో మ్యాచ్ ప్రారంభించిన నెల్లూరు జట్టు 63.5 ఓవర్లలో 229 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టులోని యశ్వంత్ 24 పరుగులు చేశాడు. అనంతపురం జట్టులోని దేవాన్ష్ 5 వికెట్లు, సంజయ్ 2 వికెట్లు తీశారు. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన అనంతపురం జట్టు 43.5 ఓవర్లలో 175 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టులోని కార్తీక్ రెడ్డి 27 పరుగులు, కిరణ్ కుమార్ 24 పరుగులు చేశారు. నెల్లూరు జట్టులోని నేత్రానంద 3 వికెట్లు, రిత్విక్ 3 వికెట్లు, విక్రాంత్ రెడ్డి 2 వికెట్లు, సుశాంత్ 2 వికెట్లు తీశారు. దీంతో నెల్లూరు జట్టు 75 పరుగులతో విజయం సాధించింది.

ప్లాస్టిక్ రహిత సమాజం కోసం కృషి



జిల్లా పోలీసు కార్యాలయం ఆవరణంలో చెత్తను, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగిస్తున్న జిల్లా ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్

కడప అర్బన్ : సమస్త జీవరాశికి, పర్యావరణానికి పెనుముప్పులా మారిన ప్లాస్టిక్ రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా ఎస్పీ ఈ.జి. అశోక్ కుమార్ పిలుపునిచ్చారు. శనివారం 'స్వర్ణాంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ స్వయంగా పాల్గొని కడపలోని జిల్లా పోలీస్ కార్యాలయ పరిసరాలలోని ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచానికి సవాలుగా మారిన ప్లాస్టిక్ వాడకం లేకుండా ఇతర పర్యావరణహిత ఉత్పత్తులను ఉపయోగించుకోవాలని సూచించారు. రేపటి తరానికి ప్లాస్టిక్ రహిత ఆరోగ్యవంతమైన సమాజాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలన్నారు. పోలీసులు క్రమశిక్షణతో ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా అందరికి స్ఫూర్తి కలిగిస్తుందన్నారు. అందరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏ.ఆర్. అదనపు ఎస్పీ బి.రమణయ్య, ఏ.ఆర్ డీఎస్పీ కె.శ్రీనివాసరావు, ఆర్.ఐ లు ఆనంద్, టైటస్, శివరాముడు, శ్రీశైల రెడ్డి, వీరేష్, ఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.